క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

బంగారుపాళెం: అక్రమ మద్యం కేసులో సీజ్ చేసిన వాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న కేసులో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లను, స్థానిక పోలీస్ సేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు చిత్తూరు ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

27లోపు ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

పూతలపట్టు: ఇంటర్మీడియట్ విద్యకు దూరమైన విద్యార్థులు తిరిగి ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగించవచ్చని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పూతలపట్టు జూనియర్ కళాశాలలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ దూరవిద్య సర్టిఫికెట్ ప్రతి ఉద్యోగానికి అర్హులని చెప్పారు. ఈ అడ్మిషన్లకు ఈ నెల 27వ తేదీ ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

కాళభైరేశ్వరుని ఆదాయం రూ.90,500



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: మహాశివరాత్రి సందర్భంగా తవణంపల్లెలో వెలసిన శ్రీ కాళభైరేశ్వర ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.90,558 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం కాళభైరేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో భక్తులు, స్థానికుల సమక్షంలో ద్వారా హుండీ కానుకలను లెక్కించారు. హుండీ ద్వారా 90,558 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

పాన్నేడుపల్లె ఉర్దూ పాఠశాల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శంకరయ్య

తవణంపల్లె: మండలంలోని పాన్నేడుపల్లె ఉర్దూ పాఠశాలను బుధవారం తవణంపల్లె ఎంఈఓ శంకరయ్య తనిఖీ చేశారు. పాఠశాల, ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ఉత్తీర్ణత పట్ల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎంఈఓతోపాటు హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



తడకరలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందం

తవణంపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగుజాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని తడకరలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. తడకరలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ ప్రియాంక 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు రక్తహీనత లేకుండా చూసుకోవాలని, ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంటికే పరిమితమైన రోగుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పల్లెకు తీరిన దాహం



తొడత్తర గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంకు

మారుమూల గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం బిందెలు చేతపట్టి కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. కొన్ని సార్లు పొలాల వద్దకు వెళ్లేవారు. కూలీలు, పేదలు పనులు మానుకొని నీటి కోసం వెంపర్లాడే దుస్థితి నుంచి రక్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మాత్రమే అందించే జలజీవన్ మిషన్ పథకానికి పూర్తి స్థాయి నిధులు చేకూర్చి పటిష్టంగా అమలు చేశారు. తద్వారా నియోజకవర్గంలో మారుమూల గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేశారు.



బంగారుపాళెం: ఎద్దులవారిపల్లెలో నిర్మించిన ట్యాంకు

- పకడ్బందీగా సాగుతున్న జలజీవన్ మిషన్ పనులు
- ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు
- నియోజకవర్గంలో రూ.32.67 కోట్లతో పనులు

తవణంపల్లె: పల్లె ప్రజల నీటి కష్టాలు తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. గ్రామీణ ప్రజలకు ఇంటింటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలనే సంకల్పంతో జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోంది. పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె, ఐరాల, బంగారుపాళ్యం, పూతలపట్టు, యాదమరి మండలాల్లో రూ.32.67 కోట్లతో 208 ఓహెచ్ఎస్ఆర్(వాటర్ ట్యాంకులు) పనులు వివిధ దశల్లో జరుగుతున్నవి. ప్రస్తుతం జరుగుతున్న పనులకు రూ.6 కోట్లు నిధులు వ్యయం చేశారు. గత ప్రభుత్వం హయాంలో జలజీవన్ మిషన్ కేంద్ర పథకమన్న ఉద్దేశంతో దాన్ని పట్టించుకోలేదు. అందుకోసం నిధులు కూడా సరిపడా కేటాయించలేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు దాహం తీర్చుకోలేక, మూగజీవాలు సైతం నానా అవస్థలు పడుతుండేవి. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజల తాగునీటి కష్టాలకు చెక్ పెట్టాలని సంకల్పించారు. అప్పటివరకు నిర్వీర్యంగా ఉన్న జలజీవన్ మిషన్‌కు ఊపిరి పోస్తూ పూర్తి నిధులు కేటాయించారు. అనంతరం ఈ పథకం కింద మారుమూల గ్రామాల్లో సైతం ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు ఊపందుకుంది. దీంతో పాటు సకాలంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పుష్కలంగా వచ్చాయి. నీరు అందుబాటులో ఉండడం, ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు నీటి బాధలు తప్పిపోయాయి. వర్షా కాలంలోనూ వాటర్ ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించి తాగునీరు కలుషితం కాకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మహిళలు నీటి కోసం అగచాట్లు పడాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో పేదల ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




దిగువతడకరలో ఏర్పాటు చేసిన కొళాయి

నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద మంజూరైన పనులు

మండలం	పనులు	నిధులు (కోట్లలో)
తవణంపల్లె	57	రూ. 8.97 కోట్లు
బంగారుపాళ్యం	37	రూ.7.03 కోట్లు
యాదమరి	42	రూ.6.64 కోట్లు
పూతలపట్టు	35	రూ.5.08 కోట్లు
ఐరాల	37	రూ.4.96 కోట్లు

చురుగ్గా జలజీవన్ మిషన్



కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 208 పనులకుగాను 95 టెండర్లు పూర్తి అయ్యాయి. మరో 113 పనులకు టెండరుదారులు ముందుకు రావాల్సి ఉందన్నారు. 76 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 4 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. 15 పనులు పూర్తయినవి. పనులు జరుగుతున్న వాటికి రూ.6 కోట్లు వ్యయం చేశాం.

– శ్రీనివాసులు, డీఈ, చిత్తూరు

గ్రామీణ ప్రజలకు వరం



జలజీవన్ మిషన్ పథకం ప్రజలకు వరంలాంటిది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీరందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయిస్తున్నాయి. కొన్ని మండలాల్లో గ్రామీణ ప్రజలు తాగునీటికి కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తుండడంతో ప్రభుత్వం ప్రతి ఇంటికీ కొళాయిలు వేయించి తాగునీరు అందిస్తున్నారు. మండలంలో 57 వాటర్ ట్యాంకులు నిర్మాణం పనులు జరుగుతున్నవి.

– ఈశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తవణంపల్లె

28న అన్ని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఆర్‌సీ లెవల్‌లో ప్రతి పాఠశాల నుంచి మూడు ఉత్తమ ప్రదర్శనలు పంపాలన్నారు. సీఆర్‌సీ స్థాయిలో నిర్వహించే ప్రదర్శనలో గెలుపొందే విద్యార్థులకు బహుమతులు అందజేయాలని డీఈవో అన్ని మండలాల విద్యాశాఖధికారులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

డీఈవో దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు



డీఈఓతో సమస్యలపై చర్చిస్తున్న పీఆర్‌టీయూ సంఘం జిల్లా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను డీఈవో విజయేంద్రరావు దృష్టికి తీసుకెళ్లామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామి కణ్ణన్ తెలిపారు. వారు బుధవారం డీఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పలు సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు జైపాల్, జోగి గురుప్రసాద్, నందకుమార్, విజయకుమార్, వెంకటేశ్, మణికంఠన్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు రుణాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: టిడ్కో గృహాలకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియను బ్యాంకర్లు త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను, పూర్తి చేసిన పనులను బ్యాంకర్లు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సొంతిల్లు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో టిడ్కో గృహాలను నిర్మిస్తుందన్నారు. ఇందులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి బ్యాంకర్లు రుణాల మంజూరును వేగవంతం చేయాలని సూచించారు. 365, 430 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి బ్యాంకర్లు ఇప్పటికే 75% రుణాలు మంజూరు చేశారని, మిగిలిన 25% రుణాలను మార్చి కల్లా పూర్తి చేస్తే రిజిస్ట్రేషన్, మార్ట్ గేజ్ ప్రక్రియను పూర్తి చేయిస్తామన్నారు. మౌలిక వసతులు, సివిల్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని.. ఈ దశలో మిగిలిన రుణాలను మంజూరు చేయాలన్నారు. నిరుపేదల కోసం నిర్మించిన 300 చదరపు అడుగుల గృహాల పనులు పూర్తయ్యాయి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేసినట్లు వివరించారు. సమావేశంలో మెప్మా పీడీ రాధమ్మ, ఎల్డీఎం శేషగిరిరావు, టిడ్కో ఈఈ వెంకటముని, ఏసీపీ రామకష్టుడు, సీఎంఎం గోపి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బంగారుపాళెంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి కరుణకుమార్

బంగారుపాళెం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కరుణకుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో బుధవారం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, బాధితులకు న్యాయం చేకూర్చేందుకు న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరిచేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతచెట్ల నరికివేత



చింతచెట్లను కూల్చుతున్న జేసీబీ

బంగారుపాళెం: గ్రామనత్తానికి సంబంధించిన చింత చెట్లను ఓ వ్యక్తి బుధవారం నరికి విక్రయించాడు. మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రాండ్లపల్లె –జయరామపురానికి వెళ్లే రహదారి పక్కన గ్రామనత్తానికి సంబంధించి కాలువలో ఉన్న రెండు చింత చెట్లను ఓ వ్యక్తి అక్రమంగా నరికి విక్రయించాడు. చింత చెట్లు అక్రమంగా నరికివేసిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ స్థలంలో ఇష్టానుసారంగా చెట్లను నరికి విక్రయిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించు కోకుండా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చింత చెట్లు నరికివేసిన వ్యక్తిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోవాలి

చిత్తూరు రూరల్: వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమార్ అధికారులు ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తన కార్యాలయంలో, అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండల తీవ్రత పెరిగిందని చెప్పారు. ముఖ్యంగా వడదెబ్బ, గుండె సంబంధిత కేసులు వస్తుంటాయని తెలిపారు. ఈ తరుణంలో వైద్యులు, అధికారులు అప్రతమంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆస్పత్రికి వచ్చే వారికి తక్షణ వైద్యం అందించాలని మందులు, సెలైన్ బాటిల్ అవసరమైనంత వరకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ఉచిత కంటి వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య బృందం

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దివంగత ఎంపీ చెంగల్రాయనాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జస్టిస్ కరుణకుమార్, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంటేశ్వరచౌదరి కంటి శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత కంటి శిబిరంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు 197 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి తిరుపతికి తరలించినట్లు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, మాజీ సర్పంచులు కమలనాథరెడ్డి, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు పేర్నాటికే



స్థానికులను ఓటడుగుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. నగరంలోని మురకంబట్టులో బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. విద్యావేత్త, సౌమ్యుడు, దానశీలి అయిన శ్యాంప్రసాద్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి ఎంపిక చేశారని స్పష్టం చేశారు. పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, కార్పొరేటర్లు, శ్రీకాంత్, నవీన్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ రాంగణేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ గఫార్‌ఖాన్ నాయకులు త్యాగ, ప్రతిమారెడ్డి, జైగణేష్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రమణారెడ్డిని గెలిపించాలని రాష్ట్ర పండిత పరిషత్ కార్యదర్శి రవిచంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నగరంలోని పీసీఆర్ ఉన్నత పాఠశాలలో పండిత పరిషత్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యదర్శి మాట్లాడుతూ టీచర్ల పలు అంశాలపై, సంఘం బలోపేతంపై చర్చించారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్ర నరేష్ బాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు హైదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



తిమ్మోజుపల్లె సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

బంగారుపాళెం: ప్రజా సమస్యలను సచివాలయ సిబ్బంది పరిష్కరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, మూమెంట్, సీఎల్ రిజిష్టర్లు, స్పందన సర్వీస్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయంలో తప్పనిసరిగా స్పందన నిర్వహించి, ప్రజా వినతులను అలసత్వం వహించకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నూర్‌మహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మారథంపై శివపార్వతుల చిద్విలాసం



పుణ్యకోటి విమానంలో విహరిస్తున్న శివపార్వతులు



పుష్ప పల్లకిలో ఆదిదంపతులు



మాడ వీధుల్లో రథంపై ఊరేగుతున్న స్వామివారు





బ్రహ్మరథంపై కొలువైన మొగిలీశ్వరస్వామి,కామాక్షమ్మ, యాదమరి: పల్లకిలో ఊరేగుతున్న శివపార్వతులు

బంగారుపాళెం: మొగిలి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం సాయంత్రం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ బ్రహ్మరథంపై భక్తులను కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథానికి పూజలు నిర్వహించి వివిధ రకాలపుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మంటపం నుంచి తీసుకువచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. సతీసమేతుడైన శ్రీకామాక్షమ్మ, మొగిలీశ్వరస్వామి, బ్రహ్మరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మరథో త్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మొగిలి శివాలయానికి చేరుకోవడంతో భక్తజన సంద్రంగా మారింది. రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి పుష్పపల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ, వంశపారం పర్యధర్మకర్త విజయకుమార్ పాల్గొన్నారు.

పుష్ప పల్లకిలో ఆదిదంపతుల విహారం

తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పుష్ప పల్లకిలో ఆదిదంపతులు విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. భైరేశ్వర ఆలయంలో నందీశ్వరునికి అభిషేకం చేయించి పూజలు నిర్వహించారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవ మూర్తులైన శివపార్వతులకు అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. రాత్రి పుష్ప పల్లకిలో కొలువుదీరిన ఆదిదంపతులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

యాదమరి: ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజావరోహణంతో ముగిశాయి. మండల కేంద్రంలో వెలసిన ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఉదయం మూలస్థానంలో వెలసిన శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం శివపార్వతులను పుణ్యకోటి విమానంలో కొలువుదీర్చి పూజలు చేసి పుర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ధ్వజావరోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో దేవదేవేరులను కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మిత్ర పురుగులతో వరికి రక్షణ



వరి పంటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: వరి పంటలో మిత్ర పురుగులను రైతులు కాపాడుకోవాలని ఏఈఓ ఖాదర్‌వలీ తెలిపారు. వైఎస్సార్ పొలంబడిలో కార్యక్రమంలో భాగంగా బుధవారం బోడిపాటివారిపల్లెలో వరిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పంటల్లో పురుగుల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడం వల్ల పొలంలో ఉన్న మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని క్రిమి సంహారక మందుల వాడకాన్ని నివారించాలని చెప్పారు. రెక్కల పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు పెట్టినా లాభం లేదని పేర్కొన్నారు. దీని వల్ల వరిపొలంలో కాండం తొలిచే పురుగు లేదని తెలుసుకోవచ్చని వివరించారు. అయితే కొందరు రైతులు తెలుసుకోకుండా పంటకు క్రిమి సంహారక మందులు వాడుతున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలతో పంటలు సాగు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.